# 8

## మేష్టారు

వెంకట్రావు ఆఫీసునుంచి వడివడిగా నడుస్తున్నాడు. ఇవాళ ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ మూలకంగా బాగా ఆలస్యమైంది. మధ్యాహ్నం సైకిలు మీద (స్నేహితుడిది) వెళ్లి కాఫీ కూడ త్రాగి రాలేదు. అప్పుడే వీధుల్లో దీపాలు కూడ వెలిగించారు. బాగా అలసి పోయివున్నాడు.

రైల్వేగేటు దాకా వచ్చేసరికి ఆగిపోవాల్సి వచ్చింది. రైలు వస్తున్నది కాబోలు, గేటు మూసేశారు. నాలుగైదు బళ్లు, ఐదారు రిక్షాలు ఆగివున్నాయి. వెంకట్రావు ఆగి ఆకాశంకేసి చూశాడు. అప్పుడే చుక్కలు కూడా వచ్చాయి. పడమటి వేపున శుక్రనక్షత్రం మిలమిలా మెరుస్తున్నది.

అతడికి శంకరం మేష్టారు గుర్తొచ్చారు. రైలు వచ్చి వెళ్లి పోయింది. గేటు తెరిచారు. అతడు గేటుదాటి సిమెంటు రోడ్డుమీదికి వచ్చాడు. తన కెందుకో ఉజ్వలంగా ప్రకాశిస్తున్న నక్షత్రంకేసి చూసి నపుడల్లా శంకరం మేష్టారు గుర్తొస్తారు. వెంకట్రావు కళ్లు చెమర్చాయి. వెంకట్రావు ఎన్నోమార్లు అనుకున్నాడు. ఆయన గురించి ప్రతిరోజూ అనుకుంటాడు. దానికి కారణం లేకపోలేదు. వెంకట్రావు మనిషిగా బ్రతకటానికి కారణం ఆయనే. వెంకట్రావు అనుకుంటాడు. శంకరం మేష్టారే తనను కన్నకొడుకులా చూసుకుని బాగుచేయక పోయినట్లయితే తాను ఏ రైల్లోనో బటాణీలు అమ్ముకుంటూనో, ఏ సినిమాహాల్లోనో సోడాలమ్ముకుంటూనో బ్రతికేవాడు. సాక్షాత్తూ

మేనమామ ఆమాట అన్నాడు. ఆ మాటలు విన్నప్పుడు అమ్మ గుండెలు పగిలిపోయేవి. మామయ్యే ఇవాళ వున్నట్లయితే ఏమను కునేవాడు! అమ్మ ఎంత సంతోషించేది! పోనీలే వాళ్ల ఆత్మలనేవి నిజంగా ఉంటే అవైనా సంతోషిస్తవి.

వెంకట్రావు నడక వేగం ఇంకా హెచ్చించాడు. అతడికి తెలుసు. వాకిట్లోంచి ఇంట్లోకి, ఇంట్లోంచీ వాకిట్లోకీ అదే పనిగా తిరుగుతూ ఒక ప్రాణం తనరాకకోసం కాంక్షిస్తూ ఉంటుంది. తనకు తెలుసు దారిలోకి చూస్తూ రెండు కళ్లు ఇంకా దూరం చూడగలిగితే బావుండును అనుకుంటాయి. తనకు తెలుసు కనక చికాకు పడుతూఉంటుంది. అయినా తా నేం చెయ్యగలడు? సిమెంటు రోడ్డుమీద చాలాదూరం వచ్చేశాడు. ఇంకా సందు గొందులు తిరిగి తిరిగి ఇల్లు చేరుకోవాలి. ఆఫీసుకు దగ్గర్లోనే ఇల్లు చూసుకుందా మనుకుంటే నెలరోజులూ భోజనం చెయ్యటానికి వీలుపడదు. అందుకని దూరంగా ఇల్లు తీసుకోవాల్సి వచ్చింది.

మొట్టమొదట్లో కమల ఒకటి రెండుసార్లు ఆఫీసునించి ఆలస్యంగా వచ్చినప్పుడు కళ్ళ నీళ్లు పెట్టుకుంది. ఒకసారి తనకు కోపంకూడ వచ్చింది.

"ఏం నాకు సరదా అనుకున్నావా, కాగితాల మధ్య చావటం! మరీ బుజ్జమ్మాయివా యేం? లేకపోతే నన్నెవరైనా ఎత్తుకపోతా రనా?" అని కసురుకున్నాడు.

కమల అయోమయంలో పడిపోయింది. ముఖం ప్రక్కకు తిప్పుకొని యేడుపు స్వరంతోటే "ఒక్కత్తెనూ నాలుగుగోడలమధ్య బిక్కుబిక్కుమంటూ...." అని. పూర్తి చేయలేదు.

కోపం పోయిన తర్వాత బుజ్జగించి నవ్వించాడు.

ఇవాళ ప్రొద్దున యెందుకో ఆ సంగతి గుర్తొచ్చింది. కాఫీ కలుపుతూంటే. ఎదురుగా కూచుని జడ మెలికలు చుడుతూ "ఇక ముందు నీకు కావలసినంత కాలక్షేపంకదూ" అన్నాడు!

కమల కేం తెలీలేదు.

"భగవంతుడు నీకు వట్టి మట్టి తలకాయని ప్రసాదించాడు" అన్నాడు, కమల నెత్తిన వో చిన్న మొట్టికాయ వేసి.

ఆమె నవ్వింది.

"నీ కింతే తెలుసు. నవ్వటం."

"మరేం చేయాలి? నాకేం తెలీదు, అది మీకు తెలీదూ?"

అతడు నవ్వాడు.

"ఓ అమ్మాయీ! ఇదివరలో వొంటరిగా నాలుగ్గోడలమధ్యా అని బాధపడుతుండేదానివే, ఇకముందు రెండునెలలలో....ఇప్పుడు చెప్పుకో చూదాం."

ఆమె నవ్వింది అలసటగా, అందంగా.

అతడూ నవ్వాడు గొప్పగా, గర్వంగా.

అతడు నవ్వినందుకు ఆమెకూ గర్వంగా ఉంది.

అత డన్నాడు.

"మరి ఏం పేరు పెడదాము?"

ఆమె ముఖం పక్కకు తిప్పుకుంది. కంఠపార్శ్వం ఎరుపుగా కనపడింది అతడికి.

ముఖాన్ని ఇటు తిప్పుకున్నా డతడు.

కండ్లు మూసుకుంది.

అతడు చెవులో చెప్పాడు.

ఆమె కిలకిలా నవ్వింది.

"మరి ఏం పేరు పెడదాము?"

కనురెప్పలు బరువుగా వాల్చి "మీ ఇష్టం" అంది.

అతడు క్షణంసేపు ఆలోచించుకున్నాడు. గణించుకున్నాడు. అతడి కళ్ళలో మెరుపు, భక్తి, గౌరవం, ప్రేమ, సంతోషం.

"మేష్టారి పేరు. వానికి మాష్టారి పేరు పెడతాను. నాన్నా, శంకరంబాబూ అని పిలుచుకుంటాను." అతడి కళ్ళు ఆనందంతో చెమర్చాయి. ఇంక నేనేం చేసేది? ఏం చెయ్యగలను, అంతకంటే?

ఆమె తల వంచుకుని "మరి........మరి" అన్నది.

ఆతడి కేమిటో అనిపించింది.

"ఏమిటి మరి?" అని తీక్ష్ణంగా అడిగాడు.

ఆమె చెప్పలేదు. నవ్వుకున్నది సన్నగా.

"ఏమిటి మరి....? కమలం?" సౌమ్యంగా అడిగాడు.

చిన్నగా, తీయగా, సిగ్గుగా చెప్పింది చెవులో.

అతడు అట్టహాసంగా నవ్వాడు. "నాది వొట్టి మట్టితలకాయ. నాకు తోచలేదు. అమ్మ పిల్లా, నువ్వు చురుకైనదానివే." బుగ్గమీద చిటికె వేశాడు.

ఆమె కళ్ళు అందమైన కోపాన్ని చూపించాయి.

"నీ కెందు కా అనుమానమొచ్చె? మన కాడపిల్ల పుట్టదు. సరేనా——బుజ్జిగాడికి మేష్టారి పేరు పెడదామా?"

కమల తల వూపింది.

అతడికి సంతోషమైంది.

వెంకట్రావు ఇంకా వడివడిగా నడిచాడు.

అతడి కేమిటో అలసట అనిపించింది. కృష్ణవిలాస్‌లోంచి రేడియో తియ్యటి మురళి వాయిద్యం వినిపిస్తోంది. సాంబ్రాణి పొగలు వలయాలుగా తిరుగుతున్నాయి. అలసట పోగొట్టుకుందామని లోపలికి దూరాడు వెంకట్రావు. కాఫీ తెమ్మన్నాడు. మురళి వాయిద్యం చాలా ఇంపుగా ఉంది. పది నిమిషాలు కూచున్నాడు. ఇంటికి పోవాలి. అప్పుడే యేడున్నరైంది. వెంకట్రావు మనసుకి ఉత్సాహంగావుంది. అప్పుడే కాఫీ తాగాడు. రేడియోలోంచి మురళి వినపడుతోంది. సిగరెట్ కాల్చుకుందామనిపించింది. సిగరెట్ ముట్టించుకొని. వొక్క లవంగం కొట్టువా ణ్ణడిగి నోట్లో వేసుకుని వెంకట్రావు ఇంటిముఖం పట్టాడు. అతడి కాళ్ళకు చప్పున బంధాలు పడినట్లైంది.

సిగరెట్ పట్టుకున్న చెయ్యి వణికింది.

క్షణకాలంలో ఆ సంఘటన జరిగిపోయింది.

రిక్షాబండి కదిలింది. ఇందాకటినుంచీ కిళ్ళీకొట్టుముందే వుంది

అది. వెంకట్రావు చూశాడు. వెంకట్రావుకి వొక్కసారి యేదో అయింది. రిక్షా కదిలింది.

వెంకట్రావు పరకాయించి చూశాడు.

"శంకరం మేష్టారు కాదుకదా?" అనుకున్నాడు.

'అంత గడ్డం ఆయన కుండేది కాదు' అని సర్ది చెప్పు కొన్నాడు.

అతడికి దిగులైంది.

కనుక్కోవలసింది. కాదు—శంకరం మేష్టారుకాదు. ఆయన ఇంకా ఎర్రగా వుండేవారు. ఆ రిక్షాలో పోయినాయిన అచ్చం పిచ్చి వాడులా వున్నాడు.

వెంకట్రావు యింటివైపు నడిచాడు.

ఎలెక్ట్రిక్ దీపాలక్రింద నడుస్తున్న అతడిహృదయంలో ఏదో దిగులు పట్టుకున్నట్లైంది.

ఇవాళ మేష్టారు ఇంతగా గుర్తొస్తున్నా రెందుకో అనుకున్నాడు. ఆరేళ్ళయింది. మేష్టార్ని చూసికూడా. తాను అప్పుడు ఎంత శ్రమపడ్డాడు! ఆయనకోసం ఎంతగా తిరిగాడు! ఎవరూ చెప్ప లేదు. ఎవరికీ తెలీదు. అవును. ఎవరికేంపట్టె? ఒక బీదస్కూలు మాష్టరును గురించి ఎవరికేం బాధ.ఆయన్ను పరువుగా బ్రతుకనియ్య లేదు. ఆయనకూతురు దేశంమీద యెక్కడో పోయిందని, ఆయన కోసం జాలిపడి మొసలికన్నీరు కార్చారు. పాపం! ఆయన వెనుక వ్యంగ్యంగా నవ్వుకున్నారు. అందుకే ఆయన వీళ్ళతో బ్రతకలేక పోయినాడు.

అసలు ఆయన్ను అలా వదిలిపెట్టేవాడుగాడు వెంకట్రావు. ఆయన కప్పుడు వొంట్లోకూడ బాగాలేదు.

అందుకే శంకరం మేష్టరంటే వెంకట్రావుకి హృదయం కృతజ్ఞతతో బరువెక్కిపోతుంది.తనను మనిషిగా చేశాడాయన. చేర దీసి ఇంట్లో వుంచుకుని స్కూలుఫైనలు ప్యాసు చేయించాడు. చూడ లేక లోకం కంట్లో నిప్పులు పోసుకునేది. వెధవకూతురు నిచ్చి

పెండ్లి చేద్దామని శంకరం మేష్టారు ఎత్తుగడ పన్నుతున్నారు అని ఆయనకు వినపడేట్లుగా, తనకు వినపడేట్లుగా కూసేది లోకం. ఆ అమ్మాయి దుఃఖంతో ఎటో పోయింది. తాను అత్తయ్యను చూసి రావటానికి పోయినాడు. మళ్ళీ వచ్చేసరికి శంకరం మేష్టారు లేడు. ఎక్కడకు పోయినాడో తెలీదు. ఆవేళనుంచీ చూస్తున్నాడు ఆయన కోసం. వెంకట్రావు యిల్లు చేరుకొన్నాడు. అతడి కేమిటో విసుగ్గా వుంది!

"అమ్మయ్య! ఇప్పటికీ!" అన్నది కమల.

"ఏం, రాననుకున్నావా? ఎటేనా వెళ్ళిపోతా ననుకున్నావా, దేశంమీద?" ఎందుకో విసుగు! అతడికే తెలీదు.

కమల బిక్కమొహం వేసింది.

"మీకోసం ఎవరో ముసలాయన వచ్చి మధ్యాహ్నం పన్నెండునుంచీ కూచుని గంటముందే వెళ్లిపోయారు."

వెంకట్రావుకి వణుకు పుట్టింది. "ఏమిటీ?" అన్నాడు.

"మధ్యాహ్నం వచ్చారు. చూడగానే భయమేసింది. ఎవరా అని లోపలికిపోయినాను. పొరపాటున ఇంట్లోకి వచ్చి ఉంటారని అనుకున్నాను. కాని ఆయనే "తల్లీ, నువ్వు.... పెళ్లానివా, మహాలక్ష్మి వమ్మా, అబ్బాయి ఆఫీసునుంచి యెప్పుడొస్తాడు" అన్నారు. నేను చెప్పాను. ఆయన్ను చూస్తే మోసగాడేమోననిపించింది. కాని, పాపం, చాలా మంచివాడులాగున్నాడు."

"సరే తల్లీ, వరండాలో కూచుని వుంటాను. ఎవరో చెప్పా రమ్మా ఇంటి అడ్రసు. ఎలానైతేనేం, చూడగలిగాను. కనుక్కున్నాను. ముత్యంలా వున్నావు చిట్టీ....ఆయన అలానే కూచున్నారు చాలాసేపు. మీరు మధ్యాహ్నం కాఫీకైనా వస్తారేమోనని చాలాసేపు ఎదురుచూశాను. మీరు రాలేదు. ఆయన అలానే గంటలతరబడి

కూచుని ఉంటే నాకు భయమైంది. రెండు గంటలప్పుడు కొ_స్త కాఫీ ఇచ్చాను. అది త్రాగి ఆయన అలానే కూర్చున్నారు. గంటముందు వెళ్ళిపోయారు. పోతూ పోతూ చాలాసేపు ఏదో గొణుక్కున్నారు. పాపం! ఆయనకు మతి సరిగ్గా లేనట్లుంది. మధ్య మధ్య తనలో తానే యేదో మాట్లాడుకున్నారు. వెంకట్రావు వింటున్నాడే కాని అతడి హృదయంలో పెద్ద సంచలనం బయలుదేరింది.

అతడి కళ్ళవెంబడి నీళ్లు ఏకధారగా ప్రవహిస్తున్నాయి.కమల భయపడిపోయింది.

వెంకట్రావు దీనంగా అడిగాడు, "ఆయన ముఖాన అర్ధ రూపాయంత కాలిన మచ్చ ఉంది కదూ!"

"అవును" అంది కమల.

"ఏం చేశావు కమలం? ఆయ నెవరో నువ్వు తెలుసుకొని ఉండాల్సింది!" కమలకు భయం పుట్టింది.

వెంకట్రావు అన్నాడు: "ఆయనే శంకరం మేష్టారు." కమలకు కళ్లు తిరిగినై. లోపలినుండి యెంత అణచుకుందా మన్నా ఆగకుండా ఏడుపొచ్చింది.

ఏడుస్తూ "నాకేం తెలీదు. నేను మొద్దుని...." అని అతడి వేపు నడిచింది. అత డామెను దగ్గరకు తీసుకున్నాడు.

———